క్లుప్తంగా

క్రీడాకారులకు అభినందన



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన వాలీబాల్ జట్టుతో ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

పుట్టపర్తి: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం–ఆంధ్రా క్రీడా పోటీల్లో క్రీడాకారులు సత్తా చాటాలని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి సూచించారు. ఇటీవల జరిగిన జిల్లా స్థాయి వాలీబాల్ పోటీల్లో గెలుపొందిన ఎనుములపల్లి క్రీడాకారులు ఆదివారం ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డిని పార్టీ కేంద్ర కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. క్రీడా పోటీలు నిర్వహించినందుకు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారుల్లోని ప్రతిభను వెలికితీసేందుకు ప్రభుత్వం ఆడుదాం–ఆంధ్రా క్రీడా పోటీలు నిర్వహిస్తోందన్నారు. జిల్లా స్థాయిలో గెలుపొంది రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన ఎనుములపల్లి జట్టుకు క్రీడా సామగ్రి పంపిణీ చేస్తామన్నారు.

పరామర్శ



వైఎస్సార్‌సీపీ నాయకుడు వెంకటరాముడిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి

ధర్మవరం: స్థానిక సిద్దయ్యగుట్టకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు వెంకటరాముడు ఇటీవల నరాల సంబంధిత వ్యాధికి బెంగళూరులో చికిత్స చేయించుకున్నారు. ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయిన ఆయన ఇంట్లో కోలుకుంటున్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి ఆదివారం వెంకటరాముడిని పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

మహిళా సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి సాయిలీల

పుట్టపర్తి: వైఎస్సార్‌సీపీతోనే మహిళా సాధికారత సాధ్యమని పార్టీ మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి సాయిలీల పేర్కొన్నారు. ఆదివారం ప్రశాంత్‌గ్రామంలో మహిళలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళలను లక్షాధికారులను చేయాలనే లక్ష్యంతోనే సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మహిళల కోసం వైఎస్సార్ ఆసరాతో పాటుగా ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. అనంతరం మహిళల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై అవగాహన కల్పించారు.

ఐకమత్యంతోనే బలిజల అభివృద్ధి



మాట్లాడుతున్న బలిజ సంఘం నాయకులు

నల్లమాడ: ఐకమత్యంతోనే బలిజల అభివృద్ధి సాధ్యమని వక్తలు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ పాఠశాల ఆవరణలో ఆదివారం మండలంలోని బలిజ కులస్తులు ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ముందుగా శ్రీకృష్ణ దేవరాయల చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కదిరి, పుట్టపర్తి, కొత్తచెరువు, ఓడీ చెరువు, అమడగూరు తదితర మండలాల్లో శ్రీకృష్ణ దేవరాయ బలిజ సేవా సంఘాలకు చెందిన పలువురు నాయకులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారు మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి రాజకీయాలకు అతీతంగా బలిజలు కృషి చేయాలన్నారు. మండల కమిటీ ఏర్పాటు, ఈనెల 17న శ్రీకృష్ణ దేవరాయల జయంతి, బలిజల కోసం కళ్యాణ మంటపం నిర్మాణం, నల్లమాడలో శ్రీకృష్ణ దేవరాయల విగ్రహ ఏర్పాటు అంశాలపై చర్చించారు.

రైతు ఆత్మహత్య

తనకల్లు: మండల పరిధిలోని బొంతలపల్లి వద్ద చెన్నకేశవులు (32) అనే రైతు ఆదివారం చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాలు.. గ్రామానికి చెందిన చెన్నకేశవులు వంట మనిషిగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. దీంతో పాటు వ్యవసాయం చేసేవాడు. పంటల పెట్టుబడి కోసం మొలకలచెరువులోని మహిళా సంఘంలో రూ.40 వేలు, తెలిసిన వారి వద్ద నుంచి మరికొంత అప్పు చేశాడు. అయితే పంటలో నష్టాలు రావడంతో అప్పులు ఎలా తీర్చాలని మదనపడేవాడు. ఈనెల 2వ తేదీన బోరు దగ్గరకు వెళ్తున్నాని కుటుంబ సభ్యులకు చెప్పి వెళ్లిన చెన్నకేశవులు ఇంటికి రాలేదు. గ్రామానికి సమీపంలోని చింత చెట్టుకు చెన్నకేశవులు ఉరివేసుకుని చనిపోయాడు. భార్య కల్పన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రాజశేఖర్ తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు.

సీఎం జగన్‌తోనే జనరంజక పాలన

- రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి పట్టం కట్టండి
- టీడీపీ కుట్రలను తిప్పి కొట్టాలి
- ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి
- ధర్మవరంలో 200 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరిక



33వ వార్డు కౌన్సిలర్ భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో టీడీపీ నాయకులను వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానించిన ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

ధర్మవరం: అభివృద్ధి, సంక్షేమానికి సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సమ ప్రాధాన్యత ఇస్తూ జనరంజక పాలన సాగిస్తున్నారు. రానున్న ఎన్నికల్లో జగన్ గెలిస్తే ప్రజలు బాగుపడతారు. తద్వారా పేదరికం లేని రాష్ట్రంగా ఏపీ మారుతుందని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక మారుతీనగర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పట్టణంలోని 33వ వార్డు కౌన్సిలర్ ఎర్రగుంట భాగ్యలక్ష్మి కేశవరెడ్డి, 34వ వార్డు ఇన్‌చార్జ్ బాలం గోపాల్, 30వ వార్డు కౌన్సిలర్ బోయ రమాదేవి, 35వ వార్డు కౌన్సిలర్ చింతా మారుతి, 40వ వార్డు ఇన్‌చార్జ్ మట్టిద్దుల కేశవరెడ్డి ఆధ్వర్యంలో టీడీపీ నుంచి 200 కుటుంబాలు వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నాయి. ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి వారందరికీ కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నవరత్నాల్లోని పథకాల ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా పేదలకు ఈ నాలుగున్నరేళ్లలో రూ.3 లక్షల కోట్ల దాకా నగదును నేరుగా ఖాతాల్లో జమ చేయడం జరిగిందన్నారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పేద కుటుంబాలకు ఆర్థిక పరిపుష్టిని అందించారన్నారు. ఒక్క ధర్మవరం నియోజకవర్గంలోనే రూ.3 వేల కోట్లకు పైగా నవరత్నాల్లోని పథకాల ద్వారా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేయడం జరిగిందన్నారు. చేనేతలు అత్యధికంగా నివసించే ధర్మవరం పట్టణంలో గతంలో టీడీపీ ప్రభుత్వం ముడిపట్టు రాయితీ నెలకు రూ.600 ఇవ్వలేక కార్మికులను ఇబ్బందులకు గురి చేసిందని మండిపడ్డారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వైఎస్సార్ నేతన్న నేస్తం పథకం ద్వారా ఏడాదికి రూ.24 వేల చొప్పున చేనేతలకు సాయం అందించిన ఘనత వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. ఇచ్చిన మాట ప్రకారం హామీలన్నీ నెరవేర్చడం జరిగిందని పేర్కొన్నారు. పట్టణంలో ప్రతి 30 వేల జనాభాకు ఒక అర్బన్‌హెల్త్ సెంటర్, మాతా, శిశు రక్షణకు మదర్ అండ్ చైల్డ్ ఆసుపత్రిని నిర్మించడం జరిగిందన్నారు. తాగునీటి ఎద్దడి తలెత్తకుండా కేతిరెడ్డి సూర్యప్రతాప్‌రెడ్డి తాగునీటి పథకం ద్వారా పట్టణ ప్రజలకు నీరు సరఫరా చేయడం జరుగుతోందన్నారు. తాను ఎమ్మెల్యేగా బాధ్యతలు చేపట్టిన రెండు పర్యాయాల కాలంలో ఒక్క ధర్మవరం పట్టణంలో 26 వేల ఇళ్లను పేదలకు అందించి గృహ నిర్మాణ సౌకర్యం కల్పించడం జరిగిందని వెల్లడించారు. ఇంతటి అభివృద్ధి రాష్ట్ర చరిత్రలో ఎక్కడా కూడా జరగలేదన్నారు.

కుట్రదారులతో తస్మాత్ జాగ్రత్త..

రానున్న ఎన్నికలు పేదలకు, పెత్తందార్లకు మధ్య జరిగే సంగ్రామం. పేదల తరఫున సీఎం వైఎస్ జగన్ ఒంటరిగా పోటీ చేస్తుంటే ప్రతిపక్షాలు అనైతిక పొత్తులతో ఒక్కటై కుట్రలు చేస్తారని వారితో అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే కేతిరెడ్డి సూచించారు. జగన్ గెలిస్తే జనమంతా బాగుపడతారని తెలిపారు. చంద్రబాబుకు ఓటుతో గట్టిగా బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. గతంలో ఇక్కడ ఎమ్మెల్యేగా పని చేసిన వ్యక్తి ఎన్నికల్లో ఓడిపోగానే పట్టుమని 20 రోజులు గడవకముందే పార్టీని వదిలిపెట్టి వెళ్లిపోయారన్నారు. అదే వ్యక్తి ఇప్పుడు రూ.100 కోట్లు పెట్టి సీటు కొంటానని అంటున్నారని పరోక్షంగా మాజీ ఎమ్మెల్యే సూరీని విమర్శించారు. రూ.వంద కోట్లు పెట్టి టీడీపీ టిక్కెట్ కొనే నాయకుడు ఎమ్మెల్యే అయితే ప్రజల నుంచి ఎన్ని కోట్లు దండుకుంటారో ఒక్కసారి ఆలోచించాలన్నారు. రానున్న ఎన్నికలు రాష్ట్ర భవిష్యత్‌కు ఎంతో కీలకమని.. ప్రతి ఒక్కరూ వైఎస్సార్‌సీపీకి మద్దతు తెలిపి అఖండ మెజారిటీతో గెలిపించాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు నీలూరి ప్రకాష్, కౌన్సిలర్లు, నాయకులు బడన్నపల్లి కేశవరెడ్డి, చాంద్‌బాషా, చందమూరి నారాయణరెడ్డి, కాచర్ల అంజి, కోటిరెడ్డి బాలిరెడ్డి, పెణుజూరు నాగరాజు, చింతా మారుతి, యర్రగుంట భాగ్యలక్ష్మి, దేవరకొండ రమేష్, మట్టిద్దుల కేశవరెడ్డి, గజ్జల శివ, గోరకాటి పురుషోత్తంరెడ్డి, బడన్నపల్లి నరసింహులు, చిల్లా భాస్కర్‌రెడ్డి, తోపుదుర్తి వెంకటరాముడు, పెద్దిరెడ్డి గారి శ్రీనివాసులు, కడప రంగస్వామి, తీర్థాల వెంకటరమణ, బోయ రమాదేవి, బాలం గోపాల్, బాలం లక్ష్మీదేవి, జింకా కంబగిరి, పరంధామిరెడ్డి, కత్తె పెద్దన్న, చెలిమి పెద్దన్న, కుమార స్వామి, చింతా యల్లయ్య, కేశగాళ్ల క్రిష్ణమ్మ, సుభాన్ తదితరులు పాల్గొన్నారు.



35వ వార్డు కౌన్సిలర్ మారుతి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీలో చేరిన టీడీపీ కార్యకర్తలు



30వ వార్డు కౌన్సిలర్ రమాదేవి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్న నాయకులు



34వ వార్డు కౌన్సిలర్ బాలం లక్ష్మి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ నాయకులు



40వ వార్డు ఇన్‌చార్జ్ కేశవరెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్న టీడీపీ కార్యకర్తలు

నేడు చెక్కుల పంపిణీ

ధర్మవరం రూరల్: దురదృష్టవశాత్తూ ఆత్మహత్య చేసుకున్న 15 మంది చేనేత కుటుంబాలకు ప్రభుత్వం రూ.5 లక్షల చొప్పున సాయం మంజూరు చేసిందని వైఎస్సార్‌సీపీ నాయకుడు గుర్రం శ్రీనివాసరెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 7:30 గంటలకు ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి స్వయంగా బాధిత కుటుంబాల ఇళ్ల వద్దకే వెళ్లి చెక్కులను అందజేస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్మెన్, వైస్ చైర్మెన్లు, కౌన్సిలర్లు, కో–ఆప్షన్ సభ్యులు, పట్టణ పార్టీ అధ్యక్షులు, జేసీఎస్ కన్వీనర్లు, అనుబంధ సంఘాల నాయకులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డిపై నిందలు వేయడం తగదు

కనగానపల్లి: తన సొంత నిధుల వెచ్చించి గ్రామాల్లోని వేలాది మంది రైతులకు ఉచితంగా బోర్లు వేయిస్తున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డిపై అనవసరంగా నిందలు వేయడం తగదని చంద్రాచెర్ల రైతులు తెలిపారు. ఆదివారం గ్రామంలోని రైతులు శివయ్య, నారాయణస్వామి, శివారెడ్డి విలేకరులతో మాట్లాడుతూ వైఎస్సార్ ఆసరా సంబరాల కార్యక్రమానికి శనివారం సాయంత్రం గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డికి స్థానికుల ఫిర్యాదు మేరకు ప్రజా సమస్యలపై అధికారులతో చర్చించారన్నారు. టీడీపీ సోషల్ మీడియా, ఎల్లో మీడియా పత్రికలు దీన్ని వక్రీకరించి ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డిపై నిందలు వేసి, తప్పుడు ప్రచారం చేయడం సరికాదన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి, ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డికి గ్రామాల్లో వస్తున్న ప్రజాదరణ చూచి, ఓర్వలేకనే టీడీపీ నాయకులు ఇలాంటి ప్రచారాలు చేస్తున్నారన్నారు.

అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం

ధర్మవరం రూరల్: అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం మోపుతున్నామని పట్టణ సీఐ సుబ్రహ్మణ్యం తెలిపారు. ఆదివారం పట్టణ సరిహద్దులోని పుట్టపర్తి రోడ్డులో వాహనాల తనిఖీ చేపట్టారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. అలాగే వాహనదారులు సీటు బెల్టు పెట్టుకోవాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ మహమ్మద్ రఫీ, తదితరులు పాల్గొన్నారు.

రూ.2 కోట్లతో రోడ్డు సౌకర్యం

- ఎమ్మెల్యే పీవీ సిద్దారెడ్డి



శిలాఫలకం ఆవిష్కరించిన ఎమ్మెల్యే పీవీ సిద్దారెడ్డి

తలుపుల: ప్రతి గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించి, రోడ్డు లేని గ్రామాలుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే పీవీ సిద్దారెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని పలు గ్రామాల్లో సుమారు రూ.2 కోట్లతో నిర్మించిన రోడ్లను ప్రారంభించారు. తలుపుల పంచాయతీలో కొరుగుట్టుపల్లి, యర్రసానిపల్లి సర్పంచ్ శ్రీలత, సేవాదళ్ జోనల్ ఇన్‌చార్జి డీకే బాబు, కన్వీనర్ ఫయాజ్ అహమ్మద్ ఆధ్వర్యంలో రోడ్లను ప్రారంభించారు. ఈదులకుంట్లపల్లిలోని చెరువుమరవపల్లి బ్రిడ్జిని మాజీ సర్పంచులు నరసింహారెడ్డి, మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో, బండ్లపల్లి పంచాయతీలో దిగువబైగారిపల్లి సీసీ రోడ్డును ఎంపీపీ రఫినాయక్, మాజీ సర్పంచ్ పురుషోత్తంరెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే పీవీ సిద్దారెడ్డి ప్రారంభించి శిలాఫలకాలు ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దేశంలోనే ఏ రాష్ట్రంలో చేపట్టనటువంటి పథకాలు రాష్ట్రంలో ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. సీఎం జగన్ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్తున్నట్లు పేర్కొన్నారు. టీడీపీవి కేవలం ఆర్భాట ప్రచారాలు అన్నారు. కార్యక్రమంలో మాజీ సింగల్ విండో అధ్యక్షుడు గిరధర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ సూర్యనారాయణ రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ టోపీ రమణ, సర్పంచులు వెంకటనారాయణ, పెద్ది నాయుడు, మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ కులశేఖర్‌రెడ్డి, కో–ఆప్షన్ మెంబర్ మహమ్మద్ పీర్, సుదాకర్‌రెడ్డి, వై.రఘునాథ రెడ్డి, అంజినరెడ్డి, మధుసూదన్ రెడ్డి, రాజగోపాల్‌రెడ్డి, లోకనాథరెడ్డి సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

అక్కచెల్లెమ్మలకు ఆసరా





ఆసరా సంబరాల్లో పాల్గొన్న మహిళలు, డ్వాక్రా మహిళలకు చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి, హిందూపురం పార్లమెంట్ సమన్వయకర్త శాంతమ్మ

కనగానపల్లి (చెన్నేకొత్తపల్లి): గతంలో డ్వాక్రా రుణాలన్నీ మాఫీ చేస్తామని చెప్పి టీడీపీ అధినేత చంద్రబాబు ఆడ పడుచులను మోసం చేస్తే, వైఎస్సార్‌సీపీ అధికారంలోకొచ్చాక సీఎం జగన్ రూ.25,500 కోట్ల రుణాలు మాఫీ చేసి అక్కచెల్లెమ్మలకు ఆసరాగా నిలిచారని రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి తెలిపారు. ఆదివారం చెన్నేకొత్తపల్లి మండలంలోని బసంపల్లిలో జరిగిన వైఎస్సార్ ఆసరా సంబరాల్లో ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డితో పాటు వైఎస్సార్‌సీపీ హిందూపురం పార్లమెంట్ ఇన్‌చార్జ్ శాంతమ్మ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన గ్రామ సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గత ఎన్నికల సమయంలో అక్కచెల్లెమ్మలకు ఇచ్చిన హామీ మేరకు డ్వాక్రా రుణాలన్నీ నాలుగు విడతల్లో మాఫీ చేశారన్నారు. అమ్మఒడి, వైఎస్సార్ చేయూత తదితర పథకాల ద్వారా సుమారు రూ.2.5 లక్షల కోట్ల మహిళ ఖాతాల్లో జమ చేశారన్నారు. చంద్రబాబు 2014 ఎన్నికల ముందు డ్వాక్రా రుణాలతో పాటు రైతు రుణాలు మాఫీ చేస్తాని మహిళలను, రైతులను నిండా ముంచారన్నారు. ప్రజలు గత చంద్రబాబు అబద్ధాల పాలన, ప్రస్తుతం జగనన్న సంక్షేమ పాలనను బేరీజు వేసుకొని వచ్చే ఎన్నికల్లో ఓటు వేయాలన్నారు.

సీఎం జగన్‌తోనే పేదలకు సంక్షేమం

హిందూపురం పార్లమెంట్ ఇన్‌చార్జ్ శాంతమ్మ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే పేదలకు సంక్షేమ ఫలాలు అందుతున్నాయన్నారు. రాబోవు ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి, మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని సీఎం చేసుకుందామన్నారు. కార్యక్రమంలో వైకేపీ ఏసీ రామేశ్వరరెడ్డి, చెన్నేకొత్తపల్లి ఎంపీపీ మజ్జిగ అంజలీ, జెడ్పీటీసీ సభ్యుడు మెట్టు గోవిందురెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నర్సిరెడ్డి, నాయకులు కనుముక్కల రాజారెడ్డి, అధికారులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, డ్వాక్రా సభ్యులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

పది విద్యార్థులకు మోడల్ టెస్ట్



పశ్నపత్రం విడుదల చేస్తున్న సీఐ సుబ్రహ్మణ్యం, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు జయచంద్రారెడ్డి

ధర్మవరం రూరల్: భారతీయ విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో ఆదివారం వాసవి జూనియర్ కాలేజీలో పదో తరగతి విద్యార్థులకు మోడల్ టెస్ట్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నామాల నాగార్జున, ముఖ్య అతిథులుగా పట్టణ సీఐ సుబ్రహ్మణ్యం, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు శెట్టిపి జయచంద్రారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు విద్యార్థులకు పరీక్షలంటే భయం పోవడానికి ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పరీక్షలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. విద్యార్థులంతా పరీక్షలు రాయాలని సూచించారు. కార్యక్రమంలో విజయలక్ష్మి ఆసుపత్రి డాక్టర్ మదన్‌మోహన్, వాసవీ జూనియర్ కళాశాల కరస్పాండెంట్ ఈశ్వరయ్య, ఏఐఎల్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు ఇడపబత్తిని ప్రసాద్, వాసవీ బాలుర జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ భాస్కర్ రెడ్డి, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బాబాజాన్, దామోదర్, ఎస్‌పీఎఫ్ విద్యార్థి సంఘం నాయకులు సాకే హరికుమార్, పీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు మంజుల నరేంద్ర పాల్గొన్నారు.

బెంగళూరు వెళ్లి పింఛన్ అందజేత



పింఛన్ అందిస్తున్న వలంటీర్ మనోహర్‌రెడ్డి

తాడిమర్రి: మర్రిమాకులపల్లి గ్రామానికి చెందిన కింకిరి వీరారెడ్డి కిడ్నీ జబ్బుతో బాధపడుతూ బెంగుళూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న వలంటీర్ ఉప్పలూరి మనోహర్‌రెడ్డి ఆదివారం బెంగుళూరు వెళ్లాడు. రూ.10 వేల పింఛన్ మొత్తాన్ని అందించాడు. బెంగళూరు వచ్చి పింఛన్ అందజేసిన వలంటీర్ సేవలను కుటుంబ సభ్యులు కొనియాడారు.

రిటైర్‌మెంట్ వయస్సు పెంచాలని వినతి



ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డికి వినతిపత్రం అందిస్తున్న ఉపాధ్యాయులు

పుట్టపర్తి: రాష్ట్ర ప్రభుత్వం విద్య రంగానికి అధిక నిధులు ఖర్చు చేసి విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చింది. తాము సీఎం జగన్ ఉదారతతో ఉద్యోగాలు పొందామని 98 డీఎస్సీ ఉపాధ్యాయులు అన్నారు. ఆదివారం పుట్టపర్తిలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఉద్యోగ విరమణ వయస్సును (రిటైర్‌మెంట్) 62 ఏళ్లకు పెంచాలని వినతిపత్రం సమర్పించారు. ఈ విషయాన్ని సీఎం జగన్ దృష్టికి తీసుకెళ్తానని ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి వారికి హామీ ఇచ్చారు.

కరణంవారిపల్లిలో టీడీపీకి షాక్



టీడీపీ నాయకులను వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానించిన సమన్వయకర్త మక్బూల్ అహమ్మద్



గుడి నిర్మాణానికి విరాళం అందిస్తున్న మక్బూల్ అహమ్మద్, బత్తల హరిప్రసాద్

- టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరిన 50 కుటుంబాలు

గాండ్లపెంట: మండల పరిధిలోని మలమీదపల్లి పంచాయతీ కరణంవారిపల్లిలో టీడీపీకి ఎదురు దెబ్బ తగిలింది. ఆదివారం రాత్రి గ్రామంలో 50 కుటుంబాలు టీడీపీని వీడి నియోజకవర్గ సమన్వయకర్త బీఎస్ మక్బూల్ అహమ్మద్, పార్టీ బీసీ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బత్తల హరిప్రసాద్ ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలు అందరికీ అందాయన్నారు. రాబోయే ఎన్నికల్లో మరోసారి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని గెలిపించుకుంటామని తెలిపారు. అనంతరం మండల పరిధిలోని మలమీదపల్లి పంచాయతీ కరణంవారిపల్లి గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న వెంకటరమణస్వామి గుడి నిర్మాణానికి విరాళం అందించారు. పార్టీ బీసీ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బత్తల హరిప్రసాద్ రూ.లక్ష, సమన్వయకర్త బీఎస్ మక్బూల్ అహమ్మద్ రూ.లక్ష విరాళాన్ని గుడి నిర్మాణానికి అందించారు. కార్యక్రమంలో ఎంపీపీ తాతం జగన్మోహన్, కన్వీనర్ గజ్జల రవీంద్రారెడ్డి, జిల్లా కో–ఆప్షన్ సభ్యుడు ఫయాజ్ అలీ, జేసీఎస్ కన్వీనర్ పోరెడ్డి చంద్రశేఖరరెడ్డి, స్థానిక నాయకులు అమానుల్లా, చలపతి, అమీర్, విజయ్‌కుమార్ రెడ్డి, రామకృష్ణ పాల్గొన్నారు.



ధర్మవరం రూరల్: సమావేశమైన విద్యార్థులు



అమడగూరు: గురువులతో పూర్వ విద్యార్థులు

అపూర్వ సమ్మేళనం

ధర్మవరం రూరల్: పట్టణంలోని సంజయ్ నగర్‌లో ఉన్న బీఎస్ఆర్ మున్సిపల్ హైస్కూల్‌లో ఆదివారం 1998–99 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. దాదాపు 25 ఏళ్ల అనంతరం పూర్వ విద్యార్థులంతా ఒకచోట చేరడంతో సందడి వాతావరణం నెలకొంది. సంతోషంతో ఒకరికొకరు యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఉపాధ్యాయులు శ్రీనివాసరెడ్డి, యజ్ఞన్న, లక్ష్మీనారాయణ, నాగభూషణం, హరిప్రసాద్, అటెండర్ నారాయణస్వామి, ప్రస్తుత ప్రధానోపాధ్యాయులను ఘనంగా సన్మానించారు.

అమడగూరు: మండలంలోని జేకేపల్లి ఉన్నత పాఠశాలలో 2004–05 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు గెట్ టూ గెదర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆనాటి తీపి గుర్తులను మరోసారి గుర్తు చేసుకుంటూ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను శాలువాలతో సన్మానించారు.

కంటి ఆపరేషన్లకు 71 మంది ఎంపిక

ధర్మవరం రూరల్: పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం యువర్స్ ఫౌండేషన్, కడపకు చెందిన పుష్పగిరి కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన కంటి వైద్య శిబిరానికి స్పందన లభించింది. 105 మందికి కంటి పరీక్షలు చేసి, వారిలో 71 మందిని కంటి ఆపరేషన్లకు ఎంపికచేసినట్లు వైస్ ప్రసిడెంట్ సుకుమార్ తెలిపారు. కార్యక్రమంలో దాతలు గుండా నాగరాజు, ప్రసిడెంట్ శీలా నాగేంద్ర, సెక్రటరీ జయరాం, జాయింట్ సెక్రటరీ నాగార్జున, ట్రెజర ర్ బండి నాగేంద్ర, పిఆర్‌ఓ రాధాకృష్ణ, డాక్టర్ సుబ్బారావు, క్యాంపు చైర్మెన్ శ్రీకాంత్‌రెడ్డి, చాంద్‌బాషా, స్టార్ ఖలీల్, నక్షత్రశాల మల్లికార్జున, రమేష్‌బాబు, సీకే రామాంజి, పల్లా లక్ష్మీనారాయణ, చింతా శ్రీనివాసులు, పోలా ప్రభాకర్, బండ్లపల్లి రంగనాథ్, వైకే శ్రీనివాసులు, ఏఐకేకే రావు, ప్రసాద్, రంగన కుమారస్వామి, రామచంద్రగుప్త, రంగన వెంకటేష్, రంగం ఆది, ఆదిశేషు, ఉకా సతీష్, మామిళ్ల ప్రసాద్, జయంతి, వినోద్, పామిశెట్టి లక్ష్మీనారాయణ, నామాల శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పోలీసుల తనిఖీలు

బత్తలపల్లి: రాబోవు ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ప్రజలు గొడవలకు దూరంగా ఉండి, ప్రశాంతంగా జీవించాలని ఎస్‌ఐ పి.శ్రీనివాసులు సూచించారు. ఆదివారం మండలంలోని తంబాపురం, జ్వాలాపురం గ్రామాల్లో పోలీసులు పర్యటించి, కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. గుట్కా, మద్యం విక్రయించేవారి ఇళ్లలో తనిఖీలు చేపట్టారు.